నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 22 జనవరి 2025 | SIDDIPET

# పేదల పొట్టకొడితే సహించం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, జనవరి 21: కాంగ్రెస్ నాయకులు సంక్షేమ పథకాలను పంచుకునేందుకే గ్రామ సభలను ఏర్పాటు చేశారని, ఆరు గ్యారెంటీల పేరుతో 13 హామీలిచ్చిన ప్రభుత్వం ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు ఎక్కడికి పోయాయో సమాధానం చెప్పాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులను విడిచి కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలను ఇచ్చేందుకే సభలు నిర్వహిస్తూ, అసలైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు పథకాలు అందించాలని, పక్షపాత ధోరణితో వ్యవహరించ వద్దని ప్రభుత్వానికి సూచించారు. భూమిలేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని, నాయకులు ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన జాబితాలోని వారికే పథకాలను మంజూరు చేస్తే, రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గ్రామసభల్లో ప్రజలు సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని, అనేక గ్రామాల్లో సభలను అడ్డుకున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే దరఖాస్తుల పేరిట ప్రభుత్వ డ్రామాలు ఆడుతున్నదని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు

శివ్వంపేట, జనవరి 21 : మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో గ్రామసభ ఫ్లెక్సీలో ప్రొటోకాల్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేపిట్లు శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పిల్లుట్లలో జరిగిన గ్రామసభకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో పెట్టలేదని బీఆర్ఎస్ నాయకులు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఫొటో పెట్టలేదని బీజేపీ నాయకులు పంచాయతీ కార్యదర్శి సుమిత్రభాయ్‌ను నిలదీశారు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగిస్తూ ఫ్లెక్సీని చింపివేశారని బీఆర్ఎస్ నాయకులు చింతస్వామి, పిల్లి శివకుమార్, బుర్ర పోచాగౌడ్, బీజేపీ నాయకులైన బొందిల శ్రీనివాస్‌గౌడ్, కామారం కిశోర్‌రెడ్డి, గుల్లయ్యగారి సుదర్శన్, పెద్దపులి రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# సకాలంలో వేతనాలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిద్దిపేట, జనవరి 21: మున్సిపల్ కార్మికుల డిసెంబర్ నెల వేతనాలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట మెరుపు సమ్మె చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఫోన్ ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవితో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామని తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. డిసెంబర్ నెల వేతనాలు ఇవ్వకపోవడంతో సంక్రాంతి పండుగకు మున్సిపల్ కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలకవర్గం ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ యూనియన్ నాయకులు నరసింహులు, రాజయ్య, వినోద, సిద్ధులు, నరసింహులు, యాదగిరి, బాలయ్య, కుమారు, బాలనరసయ్య, కవిత, నరసవ్వ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# ఇప్పెపల్లిలో భారీగా చెరుకు తోటలు దగ్ధం



కాలిపోతున్న చెరుకు పంట

జహీరాబాద్, జనవరి 21: సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఇప్పెపల్లి గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని భారీగా చెరుకు తోటలు దగ్ధమయ్యాయి. రైతులు పెంటప్ప, సుభాష్, జెట్టప్ప, జైపాల్, ఎండీ పాష, జబ్బర్, అశోక్‌రెడ్డి, అమీరొద్దీన్, జమీర్‌సాబ్‌తో పాటు మొగుడంపల్లికి చెందిన రైతులు కిష్టన్న, రామన్న అనే రైతులకు చెందిన దాదాపు 50ఎకరాల్లో చెరుకు తోటలు పూర్తిగా కాలిపోయాయి. జహీరాబాద్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. 2వేల టన్నుల చెరుకుతో పాటు పంపుసెట్లు, డ్రిప్ పరికరాలు, చెట్లు పూర్తిగా కాలిపోయి దాదాపు రూ. కోటి వరకు నష్టం వాటిల్లినట్టు బాధిత రైతులు వాపోయారు. చెరుకు తోటలపై వేలాడుతున్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానికి ఒకటి తగలడంతో నిప్పురవ్వలు రేగి నిప్పంటుకుని ఉండవచ్చని రైతులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ హసీనాబేగం, వ్యవసాయాధికారులు సందర్శించి బాధిత రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఐఐటీహెచ్‌లో ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి, బీఎస్ మూర్తి, ప్రొఫెసర్లు, ప్రతినిధులు

కంది, జనవరి 21: సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌లో మంగళవారం పాన్ ఐఐటీ వర్ల్డ్ టెక్నాలజీ సాటిలైట్ 2025 కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్, స్మార్టర్ వరల్డ్-ఏఐ, ఇండస్ట్రీ 5.0 అంశాలపై కార్యక్రమం కొనసాగింది. దేశంలోని ప్రధాన సంస్థలు, ప్రపంచ సాంకేతిక ప్రగతులు, ప్రాదేశిక, గ్లోబల్ సమస్యల పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు ఐఐటీ ప్రతినిధులు, స్టార్ట్-అప్ ఏజెంట్లు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లో కీలక సమస్యలను పరిష్కరించడం, ఆరోగ్య జాగ్రత్తలు, ఇంటర్నెట్ అవసరం లేకుండా విద్యను అందించడంపై ప్రసంగాలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాంకేతిక పురోగతికి ఐఐటీహెచ్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ప్రముఖులు, పెట్టుబడిదారులు, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# పరుగులు తీసిన ఎలక్ట్రిక్ ఇంజిన్

- మెదక్-అక్కన్నపేట మార్గంలో విద్యుత్ రైల్ ట్రయల్‌రన్ సక్సెస్



అక్కన్నపేట నుంచి మెదక్ వరకు ట్రయల్ రన్ చేపడుతున్న రైల్వే అధికారులు

మెదక్, జనవరి 21(నమస్తేతెలంగాణ)/రామాయంపేట, జనవరి 21: అక్కన్నపేట స్టేషన్ నుంచి మెదక్ స్టేషన్ వరకు మంగళవారం దక్షిణమధ్య రైల్వే అధికారులు విద్యుత్ లైన్ రైలును విజయవంతంగా నడిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి వచ్చిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో విద్యుత్ లైన్‌తో నడిపేందు కోసం రైలు ఇంజిన్‌కు పూజలు చేసి రైలును ప్రారంభించారు. అక్కన్నపేట, మెదక్ ప్రజల సౌకర్యార్థం విద్యుత్ లైన్ ద్వారా ఇక ప్రతిరోజు రైలును నడపుతామని రైల్వే అధికారులు తెలిపారు. అక్కన్నపేట స్టేషన్ నుంచి లక్ష్మాపూర్, పాతూర్ మీదుగా మెదక్ స్టేషన్ వరకు రైలు ఇంజిన్‌తో రైల్వే అధికారులు వెళ్లారు. ట్రయల్‌రన్ సక్సెస్ కావడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

**భవిష్యత్తులో దూర ప్రాంతాలకు రైళ్లు...**

మెదక్-అక్కన్నపేట మధ్య రూ.15.49 కోట్లతో నిర్మించిన 17.2 కిలోమీటర్ల రైల్వే విద్యుద్ధీకరణ ట్రయల్‌రన్ పనులు సక్సెస్ కావడంపై దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బ్రిజ్ మోహన్ మీనా సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కన్నపేట లైన్ విద్యుద్దీకరణతో హైదరాబాద్ డివిజన్‌లో 94శాతం విద్యుద్దీకరణ పూర్తయినట్లు తెలిపారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు కొత్తగా నిర్మించిన రైల్వే మార్గంలో కూడా విద్యుద్దీకరణ పనులు త్వరలో చేపడతామని ఆయన తెలిపారు. మేడ్చల్ నుంచి జిల్లా మీదుగా ముత్కేడ్ వరకు 251 కిలోమీటర్లు డబ్లింగ్ పనులు మంజూరైనట్లు తెలిపారు. డబ్లింగ్ పనులు పూర్తయితే అదనపు రైళ్లు నడపడంతో పాటు రైళ్ల వెయిటింగ్ సమస్య తీరిపోతుందని ఆయన తెలిపారు. అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మూత్రశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



నంగునూరు: పాలమాకులలో గ్రామసభలో జరిగిన గొడవను ఆపుతున్న పోలీసులు

# తిరగబడ్డ జనం

## గ్రామసభల్లో రచ్చరచ్చ

[ ప్రజాపాలనకు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల డుమ్మా... ]

- బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేను నిలదీసిన రైతు
- రైతుభరోసా కింద రూ. 15వేలు ఏవి అంటూ నిలదీత
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడికక్కడ నిలదీతలు,నిరసనలు, ఆగ్రహం
- పోలీస్ పహారా మధ్యన ప్రజాపాలన గ్రామసభలు
- ఆరు గ్యారంటీలు, హామీలపై ప్రశ్నించిన ప్రజలు



పుల్కల్ గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల ప్రక్రియపై అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



సంగారెడ్డి మండలం ఇరిగేపల్లి గ్రామంలో రుణమాఫీ, రైతు భరోసా అధికారిని ప్రశ్నిస్తున్న గ్రామ రైతులు

సిద్దిపేట, జనవరి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన గ్రామసభలు రచ్చరచ్చ అయ్యాయి. ఇందిరమ్మ ఇండ్లు తమకు ఎందుకు రాలేదు..? రేషన్ కార్డులు ఎందుకు రాలేదు..? ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్డు ఏది..? ప్రభుత్వ విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవు..? రుణమాఫీ ఎందుకు చేయలేదు..? రైతు భరోసా ఏది..? ఇలా గ్రామసభల్లో ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్ సర్కార్‌కు ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేశారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రజలు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అనర్హులకే సంక్షేమ పథకాలు అందిస్తారా..? ఏ ప్రతిపాదికన జాబితాను సిద్ధం చేశారంటూ అధికారులను నిలదీశారు. నిరుపేదలకు అన్యాయం చేశారంటూ తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తమకు ఎందుకు రాలేదంటూ అధికార యంత్రాంగంపై, ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో పోలీస్ పహారా మధ్యన, ప్రజల నిరసన మధ్యన మొదటిరోజు మంగళవారం తూతూమంత్రంగా గ్రామసభలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రజలు భగ్గుమన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల లక్ష్మీపూర్‌లో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను గ్రామస్తులు నిలదీశారు. ఎన్నికల ముందు మీరు ఏం హామీలు ఇచ్చారు.. ఇప్పుడు చేస్తున్నది ఏంటి అంటూ తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేయలేదు.. రైతుబంధు ఏదీ అంటూ రైతులు ఎమ్మెల్యేను నిలదీశారు. కాసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదంటూ హుస్నాబాద్, మద్దూరులో పలువురు మహిళలు అధికారులను నిలదీశారు. నంగునూరు మండలం పాలమాకులలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు లేవంటూ పలువురు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని కొంతమందిని అక్కడి నుంచి పంపించి పోలీస్ పహార మధ్యన గ్రామ సభను నిర్వహించారు. ఇల్లు మంజూరు కాలేదని అన్నందుకు బాధితుడిని పోలీస్‌లు గ్రామసభ నుంచి బయటకు పంపారు. ఎన్సాన్‌పల్లిలో అధికారులను కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి గ్రామసభ రచ్చ రచ్చ అయ్యింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం ఖలీల్‌పూర్‌లో నిర్వహించిన గ్రామ సభల్లో మహిళలకు రూ.2500 ఏవి అంటూ అధికారులను నిలదీశారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఏది అంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. బొల్లారం మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో గ్రామస్తులు లేకుండా కాంగ్రెస్ నాయకులతోనే గ్రామసభను తూతూ మంత్రంగా జరిపించి మమ అనిపించారు.

**గ్రామసభలకు మంత్రులు డుమ్మా..**

ప్రజాపాలన గ్రామసభలకు మొదటిరోజు మంగళవారం జిల్లాకు చెందిన మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ మొహం చాటేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఎక్కడా హాజరు కాలేదు. గ్రామ సభలకు హాజరైతే తమను ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అని డుమ్మా కొట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మెదక్ నియోజకవర్గంలో నిర్వహించిన గ్రామ సభలకు హాజరు కాలేదు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరు కాగా, గ్రామ సభల్లో ప్రజలు నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు మొదటి రోజు జరిగిన గ్రామసభల్లో స్పష్టంగా తెలిసింది.



మద్దూరు మండలం కొండాపూర్‌లో ప్రభుత్వ పథకాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మద్దూరు గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల ప్రక్రియపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



సంగారెడ్డి మండలం ఇరిగేపల్లి గ్రామంలో పథకాలు అందడం లేదని అధికారిని నిలదీస్తున్న మహిళ



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం ఖలీల్‌పూర్‌లో మహాలక్ష్మి కింద రూ. 2500 చెల్లిస్తామన్న హామీ ఏమైందని అధికారులను నిలదీస్తున్న మహిళలు




సిద్దిపేట అర్బన్: మండలంలోని ఎన్సాన్‌పల్లిలో అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు



హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డు సభలో లబ్ధిదారులకు కార్పెట్లు, కుర్చీలు వేయక పోవడంతో నిలబడే సభ నిర్వహిస్తున్న అధికారులు

# బురద చల్లడానికి రేషన్ కార్డు మంజూరు



రేషన్ జాబితాలో తన పేరును చూపుతున్న వెంకటేశ్వరరావు

సిద్దిపేట, జనవరి 21: ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం ఇటీవల చేసిన సర్వే బూటకం... తాను దరఖాస్తు చేసుకోకపోయినా తనపై బురద చల్లడానికి రేషన్ కార్డు మంజూరు చేశారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూజల వెంకటేశ్వర రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలా కాలం నుంచి రాజకీయాల్లో ఉన్నానని, ఏ వన్ కాంట్రాక్టర్‌గా కొనసాగుతూ ప్రభుత్వానికి పన్ను కడుతున్నానని, అయినా తనకు రేషన్ కార్డు ఎలా మంజూరు చేశారో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయంలో అధికారులపై పరువునష్టం కేసు వేస్తానన్నారు. ఇప్పటికైనా అధికారులు పేదలను గుర్తించి రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు.

# కరెంటు కనెక్షన్లు ఎప్పుడిస్తరు..

- డీడీలు కట్టి ఆర్నెల్లయినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వరా?
- గ్రామసభల్లో ప్రశ్నించిన రైతులు

టేక్మాల్, జనవరి 21: వ్యవసాయ బోరు బావులకు కరెంటు కనెక్షన్లు కావాలని, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మంజూరు చేయకపోవడంతో యాసంగి సాగు చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన గ్రామసభల్లో ఈ విషయమైన అధికారులను బాధిత రైతులు ప్రశ్నించారు. టేక్మాల్ మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాయిపల్లి (2), ఎక్లాస్‌పూర్ (1), కాదులూర్ (1), కోరంపల్లి (2), కుసంగి (2), తంపులూర్ (2), టేక్మాల్ (3), ఎల్లంపల్లి (1), ఎలకుర్తి (3), ఎల్లుపేట (1), వేల్పుగొండ (3) మొత్తం 11 గ్రామ పంచాయతీల పరిధిలో 21 మంది రైతులు విద్యుత్తు కనెక్షన్ల కోసం 21 ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరమైన మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించారు. 21 ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సుమారుగా 70 నుంచి 80 మంది రైతులకు వ్యవసాయ బోర్ల బావులకు విద్యుత్తు కనెక్షన్లు పొందే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుపడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నదని, కానీ.. వాస్తవంగా పరిస్థితులు వేరేగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ఉదయ భాస్కర్‌ను వివరణ కోరగా.. 21 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాలేని విషయం వాస్తవమేనన్నారు. నెలాఖరు వరకు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

# లిస్టులో మా పేర్లు ఎందుకు లేవు

## అధికారులను ప్రశ్నించిన ప్రజలు



ప్రజాపాలన రసీదును చూపిస్తున్న లాజర్

ఝరాసంగం, జనవరి 21: లిస్టులో మా పేర్లు ఎందుకు లేవంటూ దరఖాస్తుదారులు అధికారులను నిలదీయగా, వారు మరోసారి దరఖాస్తు చేసుకోమని చెప్పడంతో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని మాచనూర్, కప్పాడ్, నర్సపూర్, కృష్ణపూర్‌లో గ్రామసభలను నిర్వహించారు. మాచనూర్‌లో నిర్వహించిన గ్రామసభకు మండల ప్రత్యేక అధికారి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన లాజర్ అనే దివ్యాంగుడు ఇందిరమ్మ ఇంటి కోసం గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, లిస్టులో తన పేరు రాలేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడైనా గ్రామసభలో దరఖాస్తును అందజేద్దామనుకుంటే ఎవరూ పట్టించుకోవడం లేదంటూ, పెన్షన్ కోసం గతంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పెన్షన్ ఇవ్వడం లేదంటూ కంటనీరు పెట్టుకున్నాడు. కృష్ణపూర్‌లో నిర్వహించిన గ్రామసభకు ట్రైనీ కలెక్టర్ మనోజ్ హాజరై నాలుగు పథకాలకు సంబంధించిన లిస్టులో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, తహశీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకార్, ఏవో వెంకటేశం, ఏపీవో రాజ్‌కుమార్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.



సంగారెడ్డి మండలం ఇరిగేపల్లి గ్రామంలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

# ఇదేం భరోసా..

## రైతు అయిలేని రాజలింగారెడ్డి ఆవేదన



నా భూమిని సాగుచేయనట్టు ఎలా రాసారంటూ ఏఈవోను ప్రశ్నిస్తున్న రైతు అయిలేని రాజలింగారెడ్డి

హుస్నాబాద్ టౌన్, జనవరి 21: రెండుమార్లు మా వ్యవసాయంకాడికి వచ్చి చూసిండు... నేను ఏసిన పల్లిసేను కూడ సూసిన.. ఈడికి వత్తే ఎవసం సెయ్యనట్టు చూపితండ్రు.. నేను ఉండగానే ఎంక్వైరి చేసిండు.. రెండు ఎకరాలపైన ఉన్న భూమిలో ఎవసం సెయ్యనట్టు ఎందుకు రాసిండు.. అని వ్యవసాయధికారులను రైతు అయిలేని రాజలింగారెడ్డి నిలదీశారు. హుస్నాబాద్‌లో మంగళవారం జరిగిన వార్డు సభలో రాజలింగారెడ్డితో పాటు పలువురు రైతులు అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఎవసం చేసే భూమిని చెయ్యనట్టు ఎందుకు రాసిండ్రు అని ఏఈవో శివరాంను రైతు రాజలింగారెడ్డి ప్రశ్నించగా అయ్యో ఏమైందో నాకు కూడ తెల్వదు అని సమాధానం ఇచ్చారు. మీరే రెండుమాట్ల వచ్చి చూసిండ్రు కదా ఎందుకు పోయిందో చెప్పుండ్రు అని అడిగితే మల్ల దరఖాస్తు ఇయ్యిండ్రు.. పై అధికారులకు పంపిస్తామంటూ ఆయన రైతుకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. ఇది సరైంది కాదని రైతులకు అధికారులే అన్యాయం చేస్తే ఎలా అంటూ ఆయన అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఒక్క రాజలింగారెడ్డి అనే రైతుకాకుండా మర్యాల సదారెడ్డి, గూళ్ల సువర్ణతో పాటు పట్టణంలోని అనేక మంది రైతుల పేర్లను సైతం ఇండ్లు, సాగుచేయని భూముల జాబితాలో చేర్చడంపై రైతులు మండిపడుతున్నారు.